




# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

బుధవారం | 21 మే 2025

పేజీలు 8


విద్యుత్ అవినీతి తిమింగళం ఇంట్లో

# ఏసీబీ సోదాలు




ఆభరణాలను స్వాధీనం చేసుకున్న ఎసిబి అధికారులు

- భారీగా బంగారం స్వాధీనం
- 41 రకాల బంగారు ఆభరణాలు..2.825 కేజీల బంగారం..విలువ రూ.2.70 కోట్లు
- ఇంటి విలువ సుమారు రూ.3 కోట్లు
- వజ్రాలతో పొదిగిన హారం లభ్యం
- కొనసాగుతున్న ఏసీబీ సోదాలు..

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో/ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం చిన్నకంబలూరు గ్రామంలో రూ. 30వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన విద్యుత్తు శాఖ ఎడిఈ రవికాంత్ చౌదరి ఇంట్లో అవినీతి నిరోధకశాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. నంద్యాల శివారులోని రైతునగరం ఇంట్లో ఎసిబి డిఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. నంద్యాల పట్టణంలోని ఒక బ్యాంకులో ఎడిఈ రవికాంత్ చౌదరి భార్య పేరు మీద లాకర్ ఉన్నట్లు బయటపడింది. ఆ లాకర్‌ను తెరవగా అందులో 41 రకాల బంగారు

మిగతా 2లో

శ్రీశైలం డ్యామ్

- ఎన్నో సంవత్సరాలుగా వేధిస్తున్న ప్లంజ్ పూల్ సమస్య
- ఈ సీజన్లో ప్లంజ్ పూల్ సమస్య పరిష్కారమైయ్యేనా..!
- శ్రీశైలం డ్యామ్ భద్రతపై సీఎం ప్రత్యేక దృష్టి
- తాజాగా శ్రీశైలం డ్యాంను పరిశీలించిన పూణే శాస్త్రవేత్తల బృందం

# భద్రమేనా..?

**శ్రీశైలం,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన జలాశయాల్లో శ్రీశైలం ఒకటి. దీని గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు. దీని ద్వారా లక్షలాది ఎకరాలు సాగవుతున్నాయి. ఇంతటి కీలకమైన ప్రాజెక్టును ఎన్నో సంవత్సరాలుగా ప్లంజ్ పూలు సమస్య వేధిస్తుంది. తద్వారా భవిష్యత్తులో డ్యామ్ భద్రతకే ప్రమాదం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ ఆధ్వర్యంలో బృందం జలాశయాన్ని పరిశీలించి అత్యవసరంగా చేపట్టవలసిన పనులపై ప్రభుత్వానికి తగు నివేదికలు సమర్పించింది.

మిగతా 2లో



శ్రీశైలం డ్యాంను పరిశీలిస్తున్న అధికారులు




జెండా మోసిన ప్రతి కార్యకర్తను

# గుండెల్లో పెట్టుకుంటా

- నాలుగేళ్ళలో టెక్స్‌టైల్స్ పార్కును పూర్తిచేసి యువతకు ఉపాధి కల్పిస్తాం
- త్వరలోనే ఎమ్మిగనూరులో ఎన్టీఆర్, బీవీ విగ్రహాలను ఏర్పాటు చేస్తాం
- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి వెల్లడి
- ఎమ్మిగనూరులో మినీ మహానాడు గ్రాండ్ సక్సెస్
- పాల్గొన్న ఎంపీ నాగరాజు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు
- కార్యకర్తలే టీడీపీ పార్టీకి ఊపిరి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించాలన్న నేతలు

2లో



ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా అధ్యక్షులు, కూడా చైర్మన్ లకు గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని

# ఘనంగా నిర్వహించాలి

- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్ :** జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ నెల 21నుండి జూన్ 21వరకు నిర్వహించనున్న యోగాంధ్ర

మిగతా 7లో



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్,ఎస్పీ

కర్నూలు-విజయవాడ మధ్య జులై 2 నుండి

# విమాన సర్వీసులు

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్



కేంద్ర మంత్రికింజారపు రాం మోహన్ నాయుడుతో రాష్ట్ర మంత్రి టిజి.భరత్

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** కర్నూలు నుండి విజయవాడకు జులై 2వ తేదీ నుండి విమాన సౌకర్యం ప్రారంభమవుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్‌తెలిపారు. ప్రస్తుతానికి సోమవారం, బుధవారం, శుక్రవారాల్లో ఈ సర్వీసు నడుస్తుందన్నారు.

మిగతా 2లో

# గంజాయి కేసులో నలుగురికి ఐదేళ్ళ కఠిన శిక్ష

- రూ.25 వేలు జరిమాన

**డోన్‌రూరల్,మేజర్‌న్యూస్‌:** 2018 డిసెంబర్ 29వ తేదిన ఉదయం డోన్ పట్టణ ఎస్సై యు.సునీల్ కుమార్ తన సిబ్బందితో కలిసి పట్టణ శివారులోని ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలోని ప్రాంతంలో గస్తీ చేస్తుండగా, డోన్ పట్టణంలోని చిగురుమానుపేటకు చెందిన ఎరుకలికావడి మురళీ,

మిగతా 2లో



జైలుకు నిందితులను తరలిస్తున్న పోలీసులు

సూర్య

బుధవారం | 21 మే 2025

# శ్రీశైలం డ్యామ్ భద్రమేనా..?

(మొదటి పేజీ తరువాయి)

గతంలో కూడా పలువురు నిపుణులు పరిశీలించి వెంటనే నీటి తాకిడి వల్ల ఏర్పడిన గొయ్యిని (ప్లంజ్ పూల్ )పూడ్చేలా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.గత వైకాపా ప్రభుత్వ హయాంలో జల వనరుల శాఖ అధికారులు నిధుల కోసం నివేదికలు సమర్పించినా పట్టించుకోలేదు. డ్యామ్కు ముప్పు పొంచి ఉందని విన్నవించినా తీసుకున్న చర్యలు శూన్యమే.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జలాశయంపై దృష్టి సారిం చింది.ప్లంజ్ పూల్ సమస్యకు సంబంధించి సర్వే చేసేందుకు ఇటీవల రూ.14.70 కోట్లు విడుదల చేసింది.మరోవైపు డ్రిప్ పథకం కింద ప్రపంచ బ్యాంకు నిధుల విడుదలకు చేసిన ప్రయత్నాలు ఫలించి ప్రపంచ బ్యాంకు అధికా రులు శ్రీశైలం జలాశయాన్ని సందర్శించారు.అనంతరం ఆధునికీకరణకు రూ.104 కోట్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించారు. అయితే ఇంత వరకు డ్రిప్ నిధుల ఊసే లేకుండాపోయింది.ఈ క్రమంలో డ్యాం భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రతపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.గత కొద్దిరోజులు క్రితమే సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ వారు జలాశయాన్ని సందర్శించి తగు నివేదికలు రూపొందించారు. ప్రస్తుతం డ్యామ్ భద్రతకు ఎలాంటి ముప్పు లేదన్నారు.అయితే జలాశయం ముందు భాగాన సిలిండర్లు 12 వరకు దెబ్బతిన్నాయని వాటిని రీప్లేస్ చేసేందుకు త్వరలోనే టెండర్లు పిలిచి అప్రోచ్ రోడ్డు వేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అండర్ వాటర్ వీడియో గ్రాఫి చేసి ప్లంజ్ పూలుపై అధ్యయనం చేస్తామన్నారు.ఇంత వరకు డ్రిప్ నిధుల ఊసే లేకుండాపోయింది.దీంతో శ్రీశైలం భద్రమేనా..అనేది ప్రశ్నార్ధకంగా మారింది.ప్రభుత్వాలు త్వరగా నిధులు మంజూరు చేసిన ఈ సీజన్ లోనే ఫంజ్ పూలు సమస్య పరిష్కారమయ్యే అవకాశం లేదు.ప్రస్తుతం తాత్కాలికంగా పనులు మాత్రమే చేపట్టనున్నారు.ప్రభుత్వాల్లో కదలికొస్తేనే శ్రీశైలం జలాశయం భద్రతకు భరోసా లభిస్తుంది.

**డ్యాంను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం :** శ్రీశైలం డ్యాంను పూణేకు చెందిన సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తల బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ముందుగా వారు డ్యామ్ వ్యూ పాయింట్ వద్ద అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయిలో డ్యామ్ను పరిశీలించారు.ప్రధానంగా డ్యాం భద్రతకే పెను ప్రమాదంగా మారిన ప్లంజ్ పూల్ పై వారు పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు.ఈ శాస్త్రవేత్తల బృందంలో హనుమంతప్ప,జే.పీత్తే,జెడి నాయుడు,మహమ్మద్ సీ బిస్తా తదితరులు ఉన్నారు.డ్యాం ముందు బాగానే దెబ్బతిన్న సిలిండర్ లను వారు పరిశీలించి,అలాగే ప్రస్తుత నీటి నిల్వల వివరాలు,గ్యాలరీ,నీటి తాకిడి వల్ల కోతకు గురైన ప్రాంతం తదితర వివరాలను డ్యామ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డ్యాం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, ఈఈ వేణుగోపాల్ రెడ్డి,ఇతర ఇంజనీర్లు ఉన్నారు.

# గంజాయి కేసులో నలుగురికి ఐదేళ్ళ కఠిన శిక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఎరుకలి గరడి సూరి, తెలంగాణ రాష్ట్రం, నిజామాబాద్ జిల్లా, బాన్సువాడకు చెందిన ఎరుకలి పూసల శివకుమార్, విశాఖపట్నం జిల్లా, గొలుగొండకు చెందిన ఎరుకుల మేకల శ్రీను అనే నలుగురు నిందితులు గంజాయినీ చిన్నచిన్న ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేస్తుండగా గుర్తించి, వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి సుమారు 1.2 కిలోల గంజాయి, ఖాళీ ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు గంజాయినీ డోన్ పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో విక్రయించాలనే ఉద్దేశ్యంతో ఉన్నట్లు వెల్లడైంది. దీంతో నంద్యాల జిల్లా, డోన్ పట్టణ పోలీసుస్టేషన్లో కేసు నమోదు కాగా, నలుగురు నిందితులకు నంద్యాల జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు వారు ఐదేళ్ళ కఠిన కారాగార శిక్షను బుధవారం విధించారు. పోలీసులు సేకరించిన పక్కా సాక్ష్యాధారాలతో కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి సరళదేవి వాదనలు వినిపించగా, గౌరవ న్యాయమూర్తి శ్రీమతి కమలాదేవి నిందితులకు శిక్ష విధించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పి ఆదిరాజ్సింగ్ రాణా, డోన్ డిఎస్పి శ్రీనివాసుల పర్యవేక్షణలో శ్రమించి, నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించిన పోలీసు సిబ్బందిని అభినందించారు.

## విద్యుత్ అవినీతి తిమింగళం ఇంట్లో ఏసీబీ సోదాలు

(మొదటి పేజీ తరువాయి)



బ్యాంకులో పట్టుబడిన బంగారు ఆభరణాలు

ఆభరణాలు గుర్తించారు. సుమారు 2.825 కేజీలు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలు సుమారు రూ.2.70కోట్లు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. లాకర్లో వజ్రాలతో పొడిన హారం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే చిన్నకంబలూరు గ్రామానికి చెందిన లింగమూర్తి, రామకృష్ణాచారి పొలంలో విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు విద్యుత్తు శాఖలో దరఖాస్తు చేసుకున్నారు. ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు రూ.40వేలు ఇవ్వాలని ఎడిఈ డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేమని రైతులు చెప్పడంతో రూ.30 వేలు తీసుకునేందుకు అంగీకరించారు. ఆ మేరకు ఈ నెల 16వతేదిన ఎడిఈ రవికాంత్ చౌదరి ఆదేశాల మేరకు చిన్నకంబలూరు గ్రామంలో విద్యుత్తు బిల్ రీడర్ ప్రతాప్ రూ.30వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులకు పట్టుబడిన విషయం పాఠకులకు విధితమే. రవికాంత్ చౌదరి, ప్రతాప్లను ఈనెల 17న ఎసిబి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. రవికాంత్కు చెందిన నంద్యాల ఇంట్లో సోదాలు చేసేందుకు ప్రయత్నించగా ఆయన భార్య ఊర్లో లేకపోవడంతో మంగళవారం వచ్చినట్లు తెలియడంతో సోదాలు చేశారు. సోదాల్లో విలువైన పత్రాలు, ఎల్ఐసి బాండ్లు, ఎఫ్డిలు స్వాధీనం చేసుకున్నారు. 4.4 స్క్వయర్ ఫీట్లో ఉన్న ఇంటి విలువ సుమారు రూ.3కోట్లు ఉంటుందన్నారు. సోదాల్లో సీఐలు క్రిష్ణయ్య, శ్రీనివాసులు, సిబ్బంది దొరబాబు, విశ్వనాథ్, రాముడు, పరుశరాముడు, తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు-విజయవాడ మధ్య జులై 2 నుండి విమాన సర్వీసులు

(మొదటి పేజీ తరువాయి)

త్వరలో ప్రతి రోజూ ఈ విమాన సర్వీసు నడుపుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెప్పినట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నూలు నుండి విజయవాడకు విమాన సర్వీసు అందుబాటులోకి రావడం శుభపరిణామం అన్నారు. ఓర్వకల్లు పారిశ్రామికాభివృద్ధి లో విమాన సర్వీసు ఎంతో కీలకమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును పలుమార్లు కలిసి ఈ విషయంపై చర్చించినట్లు ఆయన గుర్తుచేశారు. అడిగిన వెంటనే దీనిపై స్పందించి విమాన సర్వీసు అందుబాటులోకి తీసుకువచ్చిన కేంద్ర మంత్రికి కర్నూలు జిల్లా ప్రజల తరుపున మంత్రి టి.జి భరత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# జెండా మోసిన ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటా

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** సీఎం చంద్రబాబు ఆశీస్సులతో తెలుగుదేశం పార్టీ జెండాను కష్టకాలంలో మోసిన ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటా' అని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కుర్ని కళ్యాణ మండపంలో ఎమ్మిగనూరు నియోజకవర్గం మినీ మహానాడు కార్యక్రమం ఎమ్మెల్యే బీవీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీ బస్తిపాటి నాగరాజులు పాల్గొన్నారు. ముందుగా ర్యాలీగా బయలుదేరి పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ గత ఏడాది మాజీ సీఎం జగన్ మహానాడుకు రాకుండా కార్యకర్తలకు అడ్డుకున్నారని, గత ఎన్నికల్లో ఎన్ని అడ్డంకులు సృష్టించినా కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చామని తెలిపారు. వైసీపీ రాక్షస ప్రభుత్వాన్ని అంతం చేసి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మంచి సుపరిపాలనను తీసుకొచ్చామన్నారు.ఈ11 నెలల కాలంలో అన్న క్యాంటీన్, పెన్షన్ల పెంపు, సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముందుకు పోతున్నామన్నారు. గ్రామాల్లో, వార్డుల్లో రోడ్లు వేసి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. జీడీపీ ద్వారా శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశీర్వాదంతో 300 కోట్లు కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే బీవీ తెలిపారు. ఎంతో కష్టపడి టెక్స్ టైల్ పార్కును తీసుకొచ్చానని దానిని కూడా వైసిపి నాయకులు శిలాఫలకంకే పరిమితం అనడం సిగ్గుచేటు అన్నారు. గతంలో నా తండ్రి బీవీ మోహన్ రెడ్డి ఇదే టెక్స్ టైల్ ను తీసుకొస్తే అప్పటి సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి కడపకు తీసుకువెళ్ళింది ఎవరని ప్రశ్నించారు. నాలుగేళ్ల లోపు ఈ పార్కును పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చి వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి తీరుతానని స్పష్టం చేశారు. పశ్చిమ ప్రాంతంలోని గుండ్రేవుల, ఆర్డీఎస్ ప్రాజెక్టులను వైసిపి ప్రభుత్వం నాశనం చేసిందని మండిపడ్డారు. త్వరలోనే ఆదోని డివిజన్ కు సాగు తాగునీరు అందించే ప్రాజెక్టును రూపకల్పనకు తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మిగనూరులో దాదాపు రెండు నెలలోపే దివంగత ఎన్టీఆర్, మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి ల విగ్రహాలను రెండు సర్కిళ్లల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి వార్డులో, గ్రామంలో బీవీ నగర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని, అందరికీ పదవులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

**స్థానిక సంస్థల్లో అన్ని విజయాలు సాధించాలి - ఎంపీ బస్తిపాటి నాగరాజు :** త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మినీ మహానాడు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూకర్నూలు జిల్లాలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతం ఎమ్మిగనూరు అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బీవీ సహకారంతో చేనేత కొరకు ఎంపీ నిధులు కింద చేనేత శాలకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. కేంద్రమంత్రిరామ్మోహన్ నాయుడు సహకారంతో కర్నూల్ విమానాశ్రయం నుండి విజయవాడ ప్రాంతానికి ప్రత్యేక విమానాన్ని కేటాయించడం జరిగిందని ఇందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. టెక్స్ టైల్ పార్కు కోసం ఎమ్మెల్యే బీవీ ఎంతో శ్రమించారన్నారు. బీసీ హాస్టల్లకు రూ. కోటి రూపాయలు నిధులు కేటాయించినట్లు తెలిపారు.

**కార్యకర్తలే టీడీపీకి ఊపిరి - తిక్కారెడ్డి :** కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి ఊపిరి అని టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మిగనూరు మినీ మహానాడు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలు అంకిత భావంతో పనిచేసేటప్పుడే పార్టీకి మనుగడ ఉంటుందన్నారు. అటువంటి కార్యకర్తలు టిడిపిలోకి ఉన్నారని గుర్తు చేశారు. మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి ద్యాస అంతా ఎమ్మిగనూరు వైపే ఉండేదని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన మొట్టమొదటిగా అగ్ని ప్రమాదంలో కొట్టాలు కాలిపోయిన సమయంలో ఎమ్మిగనూరుకు ఫైర్ ఇంజన్ తీసుకొచ్చారని తెలిపారు. అలాంటిది మొదలై ఉమ్మడి నియోజకవర్గం ఉన్నప్పుడు అన్ని గ్రామాలను అభివృద్ధి చేసి నేటికీ గుర్తు వచ్చేలా చేశారని ఆయన కొనియాడారు. అలాంటి అభివృద్ధిని తనయుడుగా బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి ముందుకు తీసుకెళ్లడం సంతోషకరంగా ఉందన్నారు. తాను మంత్రాలయం ఇంచార్జి ఉన్నప్పుడు పులికనుమ ప్రాజెక్టు సాధించడం జరిగిందని తెలిపారు. కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

**పార్టీకి సేవ చేసిన వ్యక్తులకు న్యాయం జరుగుతుంది - కూడా చైర్మన్ సోమిశెట్టి :** పార్టీకి జెండా మోసి సేవలు చేసిన ప్రతి వ్యక్తికి న్యాయం జరుగుతుందని, అధైర్య పడాల్సిన అవసరం లేదని కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. మినీ మహానాడు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి బివి మోహన్ రెడ్డి పేరును రాష్ట్రంలో కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ఎక్కడ మర్చిపోరున్నారు. గత ఐదు సంవత్సరాలు మాజీ సీఎం జగన్ ను నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. రాష్ట్రంలో వైసిపి పార్టీ అడ్రస్‌లేకుండా ప్రజలు చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని ప్రజలు అఖండ విజయంతో కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు మన రాష్ట్రాన్ని ప్రపంచ పఠంలో నిలబెట్టాలని ఎంతో శ్రమిస్తున్నారని ఆయనకు ప్రతి ఒక్కరు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశల వారికి అమలు చేస్తూ సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకు వెళు తున్నామని తెలిపారు.




మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

# గ్రామీణ మహిళల సాధికారతే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాసమూర్తి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** గ్రామీణ మహిళల సాధికారతే లక్ష్యంగా స్థానిక వెంకాయపల్లి నందు రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మెరుగైన ఉపాధి కోసం నైపుణ్యాభివృద్ధి ద్వారా గ్రామీణ మహిళలను సాధికార పరిచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని బ్రిటీష్ కౌన్సిల్, యుకెలోని టీసైడ్ విశ్వవిద్యాలయం మరియు ఆర్‌ఎంజెఐటి సొల్యూషన్స్ నేతృత్వంలో జరు గనుంది. నందనపల్లి, వెంకాయపల్లి మరియు పసుపుల గ్రామీణ మహిళలు 100కుపైగా ఈ కార్యక్రమానికి దర ఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు సాఫ్ట్ స్కిల్స్, పరిశ్రమల సంబంధిత నైపుణ్యాలు మరియు ఆచరణాత్మక అనుభవం లాంటి నైపుణ్యాలను నేర్పించడం జరుగుతుందని ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఈ శ్రీనివాసమూర్తి తెలిపారు. తద్వారా మహిళలు పరిశ్రమలలో ఉద్యోగాలు సులువుగా సంపా దించుకోగల రన్నారు. ఈ కార్యక్రమం ఆర్‌ఎంజె ఐటి సొల్యూషన్స్ నేతృత్వంలో మహిళలకు తర్ఫీదునిస్తున్నం దుకు అందులో భాగమైనందుకు తనకెంతో గర్వంగా ఉం దన్నారు. ఈ కార్యక్రమం వైస్ ప్రిన్సిపల్ ఉషారాణి అధ్యక్ష తన జరిగింది. కార్యక్రమంలో ఆర్‌ఎంజెఐటి సొల్యూషన్స్ మేనేజర్/ట్రైనర్ హూపేస్, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడా పోటీలు క్రీడాకారులకు తొలిమెట్టు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్ :** క్రీడా పోటీలు క్రీడాకారులకు తొలిమెట్టు అని వక్తలు అభిప్రాయ పడ్డారు. మంగళవారం నగరంలోని బిక్యాంపు క్రీడా మైదానంలో వాలీబాల్ ఇన్విటేషన్ అండర్-14 బాల బాలికల పోటీలు ప్రారంభ మయ్యాయి. వాలీబాల్ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉన్నత విద్య అధ్యయన కేంద్రం ప్రిన్సిపల్ కెవి మధుసూదన్, జిల్లా ఒలంపిక్ సిఈఓ విజయకుమార్‌లు పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుండే విద్యార్థులకు పోటీలను నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకొని చక్కటి క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. తమ ప్రాంగణంలో ఇటువంటి పోటీలు నిర్వహించడం తనకు గర్వకారణంగా ఉందని ప్రిన్సిపల్ మధుసూదన్ రావు అభిప్రాయపడ్డారు. పోటీల నిర్వాహకులను ఆయన అభినందించారు. పోటీల్లో 13బాలుర, 6బాలికల జట్లు పాల్గొంటాయి. ఈ కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి షరీఫ్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవితేజ, క్రీడా సంఘాల ప్రతినిధులు రామాంజనేయులు, జాఫర్, రాజు, ప్రెసిడెంట్ కలందర్ బేగ్, ఆర్గనైజింగ్ సభ్యులు చిన్న సుంకన్న, సీనియర్ క్రీడాకారులు శ్రీధర్, విశ్వం, అఖిల్,కళ్యాణ్, అఫ్జల్, సురేష్ తదితరులున్నారు.

# ఫెడరేషన్ కప్ హ్యాండ్ బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



మాట్లాడుతున్న కార్యదర్శి శ్రీనివాసులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** ఈ నెల 23నుంచి 26వరకు ఉత్తరప్రదేశ్‌లోని గోర్‌ఖ్పూర్‌లో జరగబోయే 36వ జాతీయ స్థాయి ఫెడరేషన్ హ్యాండ్ బాల్ కప్ పోటీలకు జిల్లా క్రీడాకారులు రియాజ్, జగదీష్, భువనేశ్వర్‌లు ఎంపికైనట్లు జిల్లా సంఘం కార్యదర్శి డాక్టర్ రుద్రరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను మంగళవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియంలో అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఫెడరేషన్‌కప్పు పోటీలలో విజేతలుగా నిలిచి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# మినీ మహానాడును విజయవంతం చేయండి

**జిల్లా టిడిపి నాయకులు బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు**


మాట్లాడుతున్న బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** పత్తికొండ నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు సభను విజయవంతం చేయాలని జిల్లా టిడిపి నాయకులు బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి కార్యకర్తలతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులకు మినీ మహానాడు జరుపుకోవాలని పిలుపునివ్వడంతో పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కేఈ.శ్యాంకుమార్ ఆదేశాల మేరకు వెల్దుర్తి పట్టణంలోని టిడిపి కార్యాలయం ఆవరణం నందు బుధవారం జరిగే మినీ మహానాడు సభను పత్తికొండ నియోజకవర్గంలోని మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, క్రిష్ణగిరి, వెల్దుర్తి ఐదు మండలాలకు సంబందించిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూనిట్ ఇంచార్జ్‌లు, యువకులు, టిడిపి కార్యకర్తలందరూ భారీ ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. వెల్దుర్తి మండల టిడిపి అధ్యక్షులు టి.బలరాంగౌడ్, మండల తెలుగుయువత అధ్యక్షులు సుధాకర్‌గౌడ్, నాగరాజు, ఎం.బజారు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించండి



జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌లో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, సాంఘిక సంక్షేమ అధికారిణి చింతామణి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బాలనాగన్న, నాగరాజు, కాశన్న తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు విచారించి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2025 వరకు 287మందిపై ఎఫ్ఐఆర్ నమోదు కాగా 471మంది బాధితులకు సంబంధించి రూ.6.27కోట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ 2025 నుంచి మే 2025 వరకు 15మంది బాధితులకు రూ.45.62లక్షల పంపిణీ చేయడం జరిగిందన్నారు. మిగతా కేసులకు సంబంధించి ఇంకా రూ.1.73కోట్లు సంబంధించి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు లేవనెత్తిన అంశాఆలు గ్రామాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటుపై ఆర్డీఓలు, అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పనుల్లో శ్మశాన వాటికలలో సదుపాయాలను కల్పించడానికి 5లక్షల నుంచి 8లక్షల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలను తెప్పించుకోవాలని అధికారులను ఆదేశించారు. సఫాయి కర్మాచారులు కాలువలు పరిశుభ్రం చేసేటప్పుడు తగిన మాస్కులు, గ్లౌజులు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. సఫాయి కర్మాచారులకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్పీ మంద జావలి, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు విశ్వనాథ్, నరసింహులు, అరుణజ్యోతి, ఐటిడిఏ పిఓ వెంకటశివప్రసాద్ అదనపు మున్సిపల్ కమిషనర్ దాసు, డిఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# నీటిని వృధా చేస్తే కొళాయి కనెక్షన్ కట్ : కమీషనర్ రవీంద్రబాబు


నీటిని వృధా చేయరాదని ప్రజలకు తెలుపుతున్న కమీషనర్

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** నగరంలో ఎవరైనా తాగునీటిని వృధా చేస్తే సంబంధిత గృహ, వాణిజ్య సముదాయ కొళాయి కనెక్షన్‌ను కట్ చేయాలని నగరపాలక కమీషనర్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన బాపూజీ నగర్, పాత బస్టాండ్, సిక్యాంపు రైతు బజార్ ప్రాంతాల్లో పర్యటించారు. బాపూజీనగర్ నందు డ్రైనేజీ కాలువలో మురుగునీరు ప్రవాహం అధికంగా ఉండడంతో సిల్ట్ తొలగింపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యను పరిష్కరించాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అదే ప్రాంతంలో కొందరు తాగునీటిని వృధా చేస్తుండడాన్ని గమనించిన కమీషనర్ స్థానిక ప్రజలకు నీటిని సక్రమంగా వాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఎవరైతే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తాగునీటిని వృధా చేస్తారో అట్టి వారి కొళాయి కనెక్షన్‌ను కట్ చేయాలని ఆదేశించారు. నగరంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండ పకడ్బందీ చర్యలు తీసుకున్నామని అయితే కొంతమంది తాగునీటని దుర్వినియోగం చేయడం సమంజసం కాదన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి, కొండారెడ్డి బురుజు సమీపంలోని అన్న క్యాంటీన్‌లను కమీషనర్ పరిశీలించి అల్పాహారం చేస్తున్న వారితో ఆహార నాణ్యతపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, తనిఖీ దారులు వలి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# అనాధశరణాలయంలో ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు




**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ఎన్‌టిఆర్ సేవ సమితి ఆద్వర్యంలో మంగళవారం యంగ్ టైగర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకలు నగరంలోని పుల్లారెడ్డి కాలేజీ పక్కనున్న అనాధ హోం ఆఫ్ హోప్ పిల్లల శరణాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ జన్మదినం సందర్భంగా బర్త్‌డే కేక్ కట్ చేశారు. అనంతరం వారికి అన్నదానం చేశారు. తమ అభిమాన హీరో ఎన్‌టిఆర్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని బైరెడ్డి పక్కిరెడ్డి, సన నరసింహా, మధు, వెంకటస్వామి, లాలు బాషాలు ఆ భగవంతుడిని ప్రార్థించారు.

## లేబర్ కోడ్‌లు రద్దు చేసి

# ఇచ్చిన హామీలను అమలు చేయాలి


నిరసన చేస్తున్న నాయకులు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** లేబర్ కోడ్‌లను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం రైతు కార్మిక సంఘాల ఆద్వర్యంలో ఓర్వకల్ ప్రజా సంఘాల కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏపి రైతుసంఘం మండల నాయకులు ఎస్ మధుసూదన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ షాజహాన్, శ్రీధర్‌లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు అసంఘటితరంగ కార్మికులు నాన అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, సాగు చేసుకున్న పేదలందరికి పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులు, కర్షకులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు రామకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు మల్లేష్ చాంద్ బాషా, మహేష్, మాసుం బాష, బషీర్, మురళీ, కేశాలు, ఎల్లరాజు, లక్ష్మీదేవి, శ్రీరాములు, అంగన్‌వాడి యూనియన్ నాయకులు, హమాలీ కార్మికులు తదితరులున్నారు.

# పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి


**నంద్యాల నూనెపల్లి, మేజర్‌న్యూస్ :** గ్రూప్ -1, గ్రూప్-2, బ్యాంకింగ్, ఏపీపీఎస్సీ, అన్ని పోటీ పరీక్షలకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రామకృష్ణా విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రామకృష్ణా డిగ్రీ కాలేజీ, రాజరాజేశ్వరి కోచింగ్ సెంటర్ల ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ నుంచి ఈ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులకు గ్రూప్-1, గ్రూప్-2, బ్యాంకింగ్, ఏపీపీఎస్సీ, అన్ని పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ క్లాసులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫ్యాకల్టీతో, సమగ్ర కోర్సు కవరేజ్, మెటీరియల్, మెంటార్‌షిప్‌తో విద్యార్థుల భవిష్యత్తు, ప్రభుత్వ ఉద్యోగ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కోచింగ్ కార్యక్రమం రూపకల్పన చేసినట్లు తెలిపారు. రామకృష్ణా విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులతో పాటు ఇతర విద్యార్థినీ, విద్యార్థులకు కూడా తరగతులలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఉచిత శిక్షణా తరగతులు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తి గల యువతీ, యువకులు కళాశాలలో ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు వినియోగించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల ఆఫీస్ నందు కానీ, ఫోన్ నెంబర్9985240952 సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ కేబీవీ సుబ్బయ్య, విద్యార్థి వ్యవహారాల డీన్ ఎవస్ ప్రగతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ అంకాలమ్మ పరమేశ్వరీ దేవి దేవర



**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామంలో శ్రీ అంకాలమ్మ పరమేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించి 41 రోజులు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున అమ్మవారి దేవరను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి బోనాలు సమర్పించి, అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు. గ్రామంలో దేవర సందర్భంగా ఎలాంటి ఘటనలు జరగకుండా ప్యాపిలి పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. దేవర ప్రశాంతంగా ముగియడంతో గ్రామ ప్రజలు, గ్రామపెద్దలు సంతోషం వ్యక్తం చేశారు.

# శ్రీకాళికామాతకు అష్టదళ పాదపద్మారాధన సేవ



**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :**నంద్యాల పట్టణంలోని పురాతనమైన శ్రీచంద్రశేఖర శ్రీకాళికాంబ దేవాలయంలో అమ్మవారికి మంగళవారం పురస్కరించుకుని అష్టదళ పాదపద్మారాధన సేవ నిర్వహించినట్లు అర్చకులు ఆచారి తెలిపారు. ఉదయం 8గంటలకు 108 బంగారు అష్టదళ పాదపద్మారాధనలో భాగంగా ఒక్కొక్క బంగారు పువ్వుకు ఉన్న 8 అష్టదళాలకు అర్చన నిర్వహించినట్లు తెలిపారు. ఈవిధంగా 108 బంగారు అష్టదళ పాదపద్మారాధనతో అమ్మవారికి పూజాదికాలు చేసిన అనంతరం మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# 22న హనుమాన్ జయంతి వేడుకలు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని లొద్దిపల్లె గ్రామంలో ఈ నెల 22న హనుమాన్ జయంతి మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్-2 ఎన్ సీతారామిరెడ్డి, అర్చకులు డి రాజశేఖర్ శర్మ, గ్రామపెద్దలు తెలిపారు. ఉదయం 8గంటల నుండి స్వామి వారికి సిద్దోద కృష్ణ నమో అభిషేకం, సింధూర పాలంకరణ,కలశ స్థాపన, ఆకుపూజ, కుంకుమార్చన జరుగునని, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సాయంత్రం 4గంటలకు స్వామి వారి ఊరేగింపు కొనసాగుతుందన్నారు. ఊరేగింపులో దాతల సహకారంతో వరంగల్ వారిచే సురేష్ కోలాటం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాత్రి భజన పోటీలను ఏర్పాటు చేశామని ఈ పోటీలకు ఎంట్రీ ఫీజు రూ.300లు ఉంటుందని నియమ, నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. వివరాలకు 9849581378, 9502653201ను సంప్రదించాలన్నారు.

# అధికారులు బాధ్యతగా పని చేయాలి

## - ఎంపీపీ రమాదేవి



మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** ప్రతి అధికారి బాధ్యతగా పని చేయాలని ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సభ్యులు తీసుకొని వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని అన్నారు. గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని అన్నారు. ఎంపీడీవో వరప్రసాదరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో ఏర్పాటు చేసిన నీటి తొట్లల్లో నీరు నిల్వ ఉండేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలని అన్నారు. దీని వల్ల పశువులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పశువైద్యాధికారి కృష్ణకుమార్ మాట్లాడుతూ గ్రామాలలో పశు వైద్య సేవలు ప్రజలు అందుబాటులో ఉన్నాయని, పశు సంచార వాహనం ద్వారా ఎమర్జెన్సీ సేవలను పశుపోషకులు ఉపయోగించుకోవాలని అన్నారు. మండల హౌసింగ్ ఏఈ రమణారెడ్డి మాట్లాడుతూ ఇళ్ళు మంజూరు అయిన లబ్ధిదారులు వెంటనే గృహాలు నిర్మించుకోవాలని, వాటికి సంబంధించిన బిల్లులను సకాలంలో లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఏజెండాలో పొందుపరిచిన పలు అంశాలపై చర్చించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా రేషన్ కార్డులు కావాల్సిన లబ్ధిదారులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. వెబ్‌సైట్‌లలో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు వెంకట లక్ష్మమ్మ, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి ట్రాన్స్‌పోర్ట్ చేస్తే చట్ట ప్రకారం కఠిన శిక్షలు

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** గంజాయి పండించినా, అమ్మినా, ట్రాన్స్‌పోర్ట్ చేసిన చట్టప్రకారం కఠిన శిక్షలు తప్పవని ఈగల్ సెల్ ఎస్ఐ సుజన్ కుమార్ హెచ్చరించారు. ఈగల్ ఐజి ఆకె రవికృష్ణ ఆదేశాల మేరకు నగరంలోని మార్కెట్‌యార్డు నందు జిల్లాలో నలుమూలల నుండి పని చేయుటకు వచ్చిన కూలీలు, అంతర్‌రాష్ట్ర ఎగుమతి, దిగుమతి చేయుచున్న డ్రైవర్లకు డ్రగ్స్ మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి జయలక్ష్మి, టిజీ గ్రూపు శేషగిరి శెట్టి, మార్కెట్‌యార్డు అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ఈగల్ సిబ్బంది ఎలిషా, రమేష్‌లు పాల్గొన్నారు. ఈ సదస్సులో సుజన్ కుమార్, శేషగిరి శెట్టిలు మాట్లాడుతూ కూలీల జీవితంలో గంజాయి వల్ల వచ్చే ప్రభావం గురించి చెప్పారు. అలాంటి సమాచారం ఏమైనా ఉంటే టోల్ ఫ్రీ నెం. 1972కి తెలియజేయాలన్నారు. డ్రగ్స్ శరీరాన్ని బలహీనంగా మార్చి నిరుత్సాహంతో ఉంటారన్నారు. పనిలో చురుకుదనం తగ్గుతుందని, కుటుంబ జీవితం ఆర్థికంగా ఇబ్బందికి గురవుతుందన్నారు. అనంతరం కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు.

# వాము క్వింటాలు ధర రూ.22,140లు

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు పంట ఉత్పత్తుల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. వాము క్వింటాలు ధర రూ.22,140లు పలికింది. కందులు క్వింటాలు ధర రూ.6,791లు, ఎండుమిర్చి-5రకం క్వింటం ధర రూ.8,888, మిర్చి దేవనూరు క్వింటం ధర రూ.8,199, మిర్చిసూర్-10రకం క్వింటాలు ధర రూ.7,219లు, వేరుశనగకాయలు క్వింటాలు ధర రూ.6,499లు, మినుములు క్వింటాలు ధర రూ.6771లు, ఆముదాలు క్వింటాలు ధర రూ.5829లకు వ్యాపారులు కొన్నారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుంది.

# శ్రీశైల మల్లన్న సేవలో హైకోర్టు జడ్జి



ఆలయ రాజగోపురం వద్ద స్వాగతం పలుకుతున్న దృశ్యం

**శ్రీశైలం,మేజర్ న్యూస్ :** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మంగళవారం దర్శించుకున్నారు.ఆలయ రాజగోపురం వద్ద జడ్జి కుటుంబానికి ఆలయ ఈవో శ్రీనివాసరావు,అధికారులు,అర్చక స్వాములు సాంప్రదాయబద్ధంగా ఆహ్వానం పలికారు.ఈసందర్భంగా జడ్జి దంపతులు శ్రీస్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించగా ఈవో శేష వస్త్రం,లడ్డూ ప్రసాదాలు, చిత్రపటంతో సత్కరించారు.

# సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలి - కమీషనర్ రవీంద్రబాబు



రికార్డులు పరిశీలిస్తున్న కమీషనర్

**కర్నూలు నగరం, మేజర్ న్యూస్ :** సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించి విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు ఆదేశించారు. మంగళవారం ఆయన బి క్యాంపు 56వ, అరోర నగర్ 57వ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. 56వ సచివాలయంలో విఆర్ఓ, ప్లానింగ్ కార్యదర్శులు అందుబాటులో లేక పోవడం, ఎక్కడికి వెళ్లారో మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంతో కమీషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారికి షోకాజ్ నోటీసులు జారీచే యాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు జవాబుదారితనంతో పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సచివాలయానికి వచ్చే ప్రజలను పదేపదే తిప్పుకోకుండ వారి మెప్పు పొందేలా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజలు వచ్చినప్పుడు సంబంధిత కార్యదర్శి సెలవులో ఉంటే ఇంచార్జ్ కార్యదర్శి ఆ బాధ్యతను తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ప్రతి నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి సచివాలయ పరిధిలో పక్కాగా చేపట్టాలని, సచివాలయాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

# గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : పీవో శివప్రసాద్



బ్యాగ్‌ల తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** గిరిజన గూడెంలో ఉన్న గిరిజనులు జీవనోపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐటీడీఏ పీవో వెంకట శివప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని శివపురం గూడెంను సందర్శించారు. గూడెంలో ఉన్న మహిళల కోసం జూట్ బ్యాగ్‌ల తయారీ, ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో వెంకట శివప్రసాద్ మాట్లాడుతూ గిరిజన మహిళలు ఈ కేంద్రంలో దాదాపు 20 మందికిపైగా బ్యాగ్‌లను తయారు చేసే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ తయారు చేసే బ్యాగ్‌లను ఇతర ప్రాంతాలకు ఐటీడీఏ ద్వారా తరలించి అమ్మి వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోందని అన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని అన్నారు. చెంచులు వ్యవసాయం పైన పట్టు సాధించాలని అన్నారు. వారికి కేటాయించిన భూములను వారే సాగు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. గూడెంలో పలువురికి గృహాలు లేవని, గృహాలను గృహ నిర్మాణ శాఖ అధికారులు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గిరిజన గూడెంలో ఉన్న ప్రతి విద్యార్థి పాఠశాలకు వెళ్ళాలని అన్నారు. ఉపాధ్యాయులు గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి గుండాల నాయక్, హార్టికల్చర్ అధికారి ధనుంజయ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల ఏరివేతకు రంగం సిద్ధం ?

- ఫిర్యాదులు వచ్చాయంటున్న సివిల్ సప్లై అధికారులు
- మండలంలో రేషన్ షాపుల పై ఆకస్మిక తనిఖీలు
- పక్కా ప్రణాళికలతో రేషన్ డీలర్ల పై చర్యలు



**బండి ఆత్మకూరు రూరల్ ,మేజర్ న్యూస్ :** బండి ఆత్మకూరు మండలంలోని రేషన్ డీలర్ల ఏరివేతకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఇప్పటికే 6 గ్రామాలలో తనిఖీలు నిర్వహించిన సివిల్ సప్లై అధికారులు జి సి పాలెం లోని రెండు రేషన్ షాపుల్లో నిల్వ ఉన్న స్టాక్ లో వ్యత్యాసం ఉండడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక బండి ఆత్మకూరు తహసిల్దార్ కి గత రెండు వారాల కిందట సివిల్ సప్లై అధికారులు సూచించినట్లు తెలుస్తుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి మండలంలోని గ్రామాలలో స్థానిక టిడిపి నాయకులు రేషన్ డీలర్ల అక్రమాలు పాల్పడుతున్నరని రేషన్ డీలర్ల పై చర్యలు తీసుకోవాలని నాయకులపై పలు సందర్భాల్లో ఒత్తిడి తీసుకొచ్చినట్లు గతంలో బహిరంగంగానే వినబడింది. గత వైసిపి ప్రభుత్వం లో కనీసం రేషన్ షాప్ ల వైపు చూసి చూడనట్లు వ్యవహరించిన సివిల్ సప్లై అధికారులు కూటమి ప్రభుత్వం ఏర్పడగానే నియోజకవర్గ వ్యాప్తంగా బండి ఆత్మకూరు, వెలుగోడు, ఆత్మకూరు ,శ్రీశైలం మండలాలలోని రేషన్ షాపులపై ఆకస్మిక తనిఖీలతో చర్యలు చేపట్టారు. వాస్తవానికి ప్రత్యక్షంగా లేకుండానే పరోక్షంగానే రేషన్ మాఫియాకు రేషన్ డీలర్లు తమ వంతు సహాయ సహకారాలు అందించాయనే వార్తలు గత ప్రభుత్వంలో బహిరంగంగా వినబడ్డాయి. ప్రభుత్వం మారడంతో బండి ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల టిడిపి నాయకులు వారి గ్రామాలలో ప్రజలకు రేషన్ పంపిణీలో డీలర్ల పై అసంతృప్తిలో ఉన్నారని చట్ట ప్రకారం విచారణ చేసి చర్యలు తీసుకొని తొలగించాలని టిడిపి అధిష్టానం పై ఒత్తిడి తీసుకొని వచ్చారు. అందులో భాగంగా గత సంవత్సరం డిసెంబర్ నెలలో నిత్యావసర వస్తువుల పంపిణీ చౌక దుకాణములకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామకం చేపడుతున్నట్లు దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు ఆర్డీవో ఓ ప్రకటనలో తెలిపారు. కానీ కొన్ని అనివార్య కారణాలవల్ల ఆ ప్రక్రియ కాస్త

**ఫిర్యాదులు తోనే తనిఖీలు – సివిల్ సప్లై డి టి శ్రీనివాసులు**
రేషన్ షాపులలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాము. ఉన్నతాధికారుల సూచన మేరకు ఇప్పటివరకు ఫిర్యాదులు వచ్చిన షాపులపై తనిఖీలు నిర్వహించాము. కొన్ని మండలాలలో స్టాక్ నిల్వ లలో వ్యత్యాసం ఉండడం గుర్తించామని పంచనామా చేసి సంబంధిత డీలర్లపై తహసీల్దారులకు ఫిర్యాదు చేశాము. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేషన్ డీలర్ల పై చర్యలు తీసుకుంటాము.



,15 లో నిల్వ ఉన్న వస్తువులకు వ్యత్యాసం ఉండడంతో చర్యలు తీసుకోవాలని స్థానిక తహసిల్దారుకి సివిల్ సప్లై అధికారులు సూచించారు. దాదాపు 6 గ్రామాలలో సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేపట్టి పంచనామ నిర్వహించి నివేదికలను తహసిల్దార్ అందజేశారు. ఈ ఆకస్మిక తనిఖీలతో రేషన్ డీలర్ల గుండెల్లో గుబులు మొదలయ్యాయి. బండి ఆత్మకూరు మండలంలో దాదాపు సగానికి పైగా రేషన్ డీలర్ల తొలగింపు జరుగుతుందని ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ ప్రక్రియలో అధికారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయిలో వెళ్లి రేషన్ షాపులను తనిఖీ చేస్తూ నిల్వ ఉన్న స్టాకు ఆన్లైన్ స్టాక్ వ్యత్యాసం కనుగొని అక్రమాలు జరిగినాయి అని నిర్ధారించిన తర్వాత ఓ పద్ధతి ప్రకారం తొలగింపు ప్రక్రియ జరుగుతుందని విశ్వసనీయ సమాచారం.

## మస్జీద్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న టీడీపీ జిల్లా కార్యదర్శి ఫిరోజ్



ఫిరోజ్‌ను సన్మానిస్తున్న మస్జీద్ కమిటీ నాయకులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణం బాలాజీ కాంప్లెక్స్ మారుతీ టౌన్ షిప్ ఎదురుగా నిర్మించిన తౌహీద్ మస్జిద్‌ను మంగళవారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ టీడీపీ పార్టీ ముస్లింల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని అన్నారు. వివిధ సంక్షేమ పథకాలను ప్రారంభించి ముస్లింల సంక్షేమం, ఉపాధి కల్పన కొరకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తౌహిద్ మస్జిద్‌లో ప్రేయర్ హాల్, లైబ్రరీ, దావసెంటర్‌తో కూడిన అత్యాధునిక హంగులతో నిర్మించిన ఈ మస్జీద్ ద్వారా ఎంతో మంది ముస్లింలు ఇస్లామిక్ విద్యను అభ్యసించేలా నిర్వాహకులు కృషి చేయాలని అన్నారు. మస్జీద్‌కు వెళ్లేందుకు రోడ్డు మార్గం లేదని ఫిరోజ్ దృష్టికి నిర్వాహకులు తీసుకొని వచ్చారు. మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకొని వెళ్లిన తరువాత రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సమ్మర్ క్యాంపు పూర్తి చేసుకున్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఫిరోజ్‌ను మస్జీద్ కమిటీ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తౌహిద్ మస్జీద్ కమిటీ సభ్యులు, నంద్యాల అహలే హదీస్ నాయకులు, కౌన్సిలర్ ఖండే శ్యాం సుందర్‌లాల్, ఇస్లామిక్ విద్యావేత్తలు, ముస్లింలు పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు

- సూర్య కథనానికి స్పందించిన అధికారులు
- కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండలంలో గత నాలుగైదు రోజులుగా ఈదురు గాలులు భారీ ఉరుములు మెరుపుల కురిసిన వర్షాలకు మండల పరిధిలోని చిన్న తుంబళం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయి నాల్గవ వార్డులో నాలుగైదు రోజులుగా కరెంటు లేక అల్లాడుపోతున్నాం అనే వార్తా మంగళవారం సూర్య దినపత్రికలో రావడంతో వెంటనే మండల విద్యుత్ శాఖ ఏఈ సుబ్బారెడ్డి స్పందించి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసి కరెంటు కనెక్షన్ ఇవ్వడం జరిగిందని మండల విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డి మంగళవారం మేజర్ న్యూస్ విలేకరికి తెలిపారు. అలాగే విద్యుత్ సరఫరా చేయడం వలన కాలనీ వాసులు ఏఈకి కృతజ్ఞతలు తెలిపారు.

## టీడీపీ మండల కన్వీనర్ పదవి కురువ దర్గన్నకే ఇవ్వాలి



కురువ దర్గన్న

**హొళగుంద,మేజర్ న్యూస్ :** టీడీపీ మండల కన్వీనర్ పదవి ఎల్లార్తి గ్రామానికి చెందిన కురువ దర్గన్నకే ఇవ్వాలని నాయకులు ముక్తకంఠంగా చాగప్ప, గర్జప్ప,బిజిహళ్లి నాగప్ప,పాలాక్షప్ప, ఎల్లార్తి ఎంపిటిసి సభ్యులు బసప్ప,మాజీ వైస్ సర్పంచ్ లింగాయితీ మల్లికార్జున మంగళవారం పార్టీ అధిష్టానాన్ని కోరారు. హొళగుంద మండలంలో కురువ సామాజిక వర్గం అధికంగా ఉన్నారని చెప్పారు. కురువ కులస్థుల్లో కురువ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు,టీడీపీ జిల్లా బీసీ సెల్ సభ్యుడు అయినా దర్గన్న పట్టు ఉన్న నాయకుడని వారు చెప్పారు. రాజకీయంగా, సామాజిక వర్గంగా కృషి చేసే వ్యక్తి దర్గన్న అని అందరిని కలుపుకుని పోతు పార్టీ కోసం సేవలను అందిస్తారని అన్నారు. ఇంత వరకు ఇతర వర్గాలకు అవకాశం కల్పించారని ఈ సారి కురవ కులస్తులకు అవకాశం ఇస్తు అందులో కురవ దర్గన్నకే మండల కన్వీనర్ పదవిని కట్టబెట్టాలని పార్టీ తాలూకా ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడను కలిసి వారు కోరారు. కావునా పార్టీ అధిష్టానం గుర్తించి ఈ సారి మండల కన్వీనర్ పదవి కురువ సామాజిక వర్గంకు చెందిన ఎల్లార్తి దర్గన్నకే ఇవ్వాలని కోరారు.

## మెరుగైన వైద్య సేవలు అందించండి



సూపరిటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సచివాలయ ఉద్యోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నన్నూరు గ్రామ సమీపంలో టోల్‌గేట్ వద్ద సచివాలయం–2లో అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ విధులు నిర్వహిస్తున్న ముకుంద ప్రియా రోడ్డు ప్రమాదానికి గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని అక్కడికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపిడిఓ శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి సుధాకర్, నన్నూరు గ్రామ టిడిపి నాయకులు విశ్వేశ్వర్‌రెడ్డి, విజేయుడు, కాజా మియ్యా, సర్కార్ తదితరులున్నారు.

## రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి గాయాలు



గాయపడిన ముకుంద ప్రియ

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని నన్నూరు గ్రామ సమీపంలోని సచివాలయం–2లో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వై ముకుంద ప్రియ రోడ్డు ప్రమాదానికి గుర్యైందని ఓర్వకల్లు ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు మంగళవారం టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై కడప జిల్లాకు చెందిన డ్రైవర్ మల్లేశ్వర్ రెడ్డి ఏపి 39యుహెచ్6309 నెంబర్ గల లారీని అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా ఎటువంటి ఇండికేటర్ సూచిక లేకుండ రోడ్డుపై ఆపగా వై ముకుంద ప్రియా తన ద్విచక్ర వాహనంపై విధులకు వస్తుండగా చూసుకోకుండ లారీని ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైందని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా తరలించారని పరిస్థితి కొంత విషమంగా ఉందని తెలిపారు. రోడ్డు ప్రమాదానికి గురైన వై ముకుంద ప్రియా తండ్రి రుక్మాంగద రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సూర్య www.suryaa.com
బుధవారం | 21 మే 2025

# దోమల నివారణకు ప్రత్యేక చర్యలు


మందును పిచికారి చేయిస్తున్న డివిజనల్ మలేరియా అధికారి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** దోమలు, ఈగలు ప్రభలకుండా ఉండేందుకు గాను వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆదోని డివిజనల్ మలేరియా అధికారి సాయిబాబా తెలిపారు. అందులో బాగం గా మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని కేజీబీవీ పాఠశాల, బీసీ బాలికలహస్టల్‌లో దోమలు,ఈగలు ప్రభల కుండా వాటి గుడ్లు లేకుండా చేసేందుకు గాను మండల వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది మలేరియా అధికారి సాయిబాబా ఆధ్వర్యంలో ఈగలు, దోమలు మందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ సెలవులు పూర్తి గానే విద్యార్థులు వచ్చి హస్టల్సో ఉంటారు కావున వారికి దోమల బెడద లేకుండా ఉండేందుకు గాను దోమల మందును పిచికారి చేయిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు" పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్సీడీ జీలుగు విత్తనాలు కేటాయింపు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ మండలానికి సంబంధించి ప్రభుత్వం సబ్సిడీ కింద 215 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను కేటాయించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 50శాతం సబ్సిడీతో రైతులకు ఈ విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జీలువ విత్తనాల పూర్తి ధర క్వింటానికి రూ.12,300 కాగా రైతుకు 50శాతం సబ్సిడీ పోగా క్వింటానికి రూ. 6150 ధరతో ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక ఎకరానికి 10 కిలోల చొప్పున 5 ఎకరా లకు 50 కిలోల వరకు జీలుగు విత్తనాలను ప్రతి రైతుకు సబ్సిడీ కింద ఇవ్వడం జరుగు తుందన్నారు. జీలుగా విత్తనాలు కావాల్సిన రైతులు అందరూ రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలన్నారు.

# కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న ఏవో రంగనేతాజీ

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** కౌలు రైతులకు గుర్తింపు కార్డు తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి రంగనేతాజీ తెలిపారు. మండలంలోని మద్దూరు, కొలుములపేట, కదిరిపురం గ్రామాలలో మంగళవారం పంటసాగు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతులు కౌలుకార్డు పొందేందుకు, పంటసాగు హక్కు పత్రాలను పొందేందుకు రైతులు ఎలాంటి పత్రాలను తీసుకురావాలని వివరించారు. కౌలుకార్డు పొందిన రైతులకు బ్యాంకు రుణం కూడా పొందవచ్చని, పొలం యజమానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందని తెలిపారు. పంట సాగు హక్కు పత్రాలకై కౌలు రైతులు వారి ఆధార్, పొలం పాసుపుస్తకం, భూ యజమాని ఆధార్, పొలం కౌలు అగ్రిమెంట్ ఇచ్చి పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

# పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



**పాములపాడు మేజర్ న్యూస్ :** పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని పాములపాడు రైతు సంఘం నాయకులు అన్నారు మంగళవారం మండల కేంద్రం లోని డిజిటల్ అసిస్టెంట్ కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు కోట్ల నాగేశ్వర్‌రెడ్డి ,సుబ్బారెడ్డి, గాండ్ల సురేష్, శ్రీనివాసులు మాట్లాడుతూ గతం లో 18వేలకు అమ్మిన ఎండుమిర్చి ఇప్పుడు 9,000 పడిపోయిందని మినుములు కందులు పత్తి పొగాకు సెనగలు వంటి పంటలు అధ్వానంగా రేట్లు ఉన్నాయని ఇదే పరిస్థితి ఉంటే కౌలు రైతులు ఎలా జీవనం సాగించాలో తెలియక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ప్రభు త్వం వెంటనే చర్య తీసుకుని రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వాన్ని కోరారు కార్యక్రమంలో శివ నాగిరెడ్డి ,రవి, షర్ఫుతుల్లా రైతులు పాల్గొన్నారు.

# పండ్ల తోటల పెంపకం చెప్పటాలి-ఏపీడీ అల్లిపిరాన్

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :**


ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన ఏపీడి. అల్లిపిరాన్

సి.బెళగల్ మండలం బ్రాహ్మణ దొడ్డి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగ ళవారం యెమ్మిగనూరు క్లస్టర్ ఏపీడి అల్లిపిరాన్ తనిఖీ చేశా రు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కచ్చితమైన కొల తల ప్రకారం పనిచేసి వేతనం పొందాలని సూచించారు. ఉపా పనులకు పదేనిమిది సంవత్సరాలు నిండని యువకులు వస్తున్నా సమాచారం మేరకు ఇటువంటి యువకులను పనిలో అనుమతించరాదని ఉపాధి సిబ్బందికి ఎస్ ఎ లకు సూచించారు. మండలంలో పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారినుండి రీవ్యూ తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు బాలుర్లతో పోటీపడి విద్యలో రాణించాలి

**ఐసిడిఎస్ వెల్దుర్తి సూపర్‌వైజర్ సరస్వతీ**


అవగాహన కల్పిస్తున్న వెల్దుర్తి సూపర్‌వైజర్ సరస్వతి

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** బాలికలు బాలురతో సమానంగా పోటీపడి విద్యలో ప్రతిభను చాటాలని ఐసిడిఎస్ వెల్దుర్తి ప్రాజెక్ట్ వెల్దుర్తి సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. మండల పరిధిలోని మదార్‌పురం గ్రామంలోని సచివాలయం నందు మంగళవారం కిషోర బాలికల వికాసం వేసవికాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిషోర బాలికలు ప్రతిపనిలో ధైర్యంగా ముందుండి పోరాడాలని, కిషోర వికాస బాలికలకు లింగ వివక్షన లేకుండా అబ్బాయిలతో పోటీపడి సమానంగా చదు వుకోవాలని, ప్రతి పనిలో ముందుండాలని, యుక్తవయస్సులో వచ్చే మార్పుల గురించి సమస్యల గురించి క్షుణ్ణంగా అర్థమయ్యే విధంగా వికాస బాలికలకు వివరించారు. ఆరోగ్యంగా ఉండాలని, మంచి పౌష్టికాహా రం తినాలని సూచించారు. ఈ కార్యక్రమ ంలో ఏఎన్ఎం, ఆశవర్కర్లు, అంగన్‌వాడిటీ చర్లు భార్గవి, నాగలక్ష్మి, ఆశ సత్యమ్మ, కిషోర వికాస బాలికలు పాల్గొన్నారు.

# ఆడపిల్లల పట్ల లింగవివక్షత.. అసమానతలు ఉండకూడదు.. సిడిపిఓ నరసమ్మ

బాలికల్లో ఆడ మగ తేడా పట్ల వివక్షత ఉండకూడదు



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** సమాజంలో బాలికల్లో ఆడ మగ తేడా పట్ల విభేదాలు ఉండకూడదని మంత్రాలయ నియోజక వర్గం ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి నరస మ్మ అన్నారు. మంగళవారం మండల పరి ధిలోని హనుమాపురం గ్రామంలో మండల ఐసిడిఎస్ సూపర్ వైజర్ విజయ కుమారి అద్వర్యంలో కిశోర్ వికాసం కార్యక్రమం పై బాలికలకు శిక్షణ తరగతులు నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమె పలువురు కిషోర్ బాలికలను ఉద్దేశించి మాట్లాడాతూ ప్రతి ఒక్కరుబాలికల్లో మార్పులు రావాలని అంతేకాకుండా కౌమారదశలోనే మంచి పౌష్టికాహారం తీసుకోవడం వలన వారు ఆరోగ్యంగా ఉంటారని ఆమె అన్నారు. అలాగే ప్రతి కుటుంబం లో మహిళలు బాగుంటేనే వారి కుటుంబాలు బాగుంటు ందన్నారు. అధేవిధంగా బాలికలు పోషకాలతో కూడిన ఆహారాన్ని తప్పకుండా తీసుకోవాలి. బాల్యవివాహాలు వల్ల వారు తీవ్ర ఇబ్బందులకు గురికావడమే కాకుండా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అందు వల్ల బాలికలు ఎట్టి పరిస్థితుల్లో బాల్యవివాహాలు చేసుకొరాదని అలాగే బాలికలు ప్రతి ఒక్కరిలో అవేరనెస్ రావాలని అమె బాలికలుకు సూచించారు. ఈకార్యక్రమంలో మండల ఐసిడిఎస్ సూపర్ వైజర్ విజయ కుమారి. మహిళా సంరక్షరాలు రమణాదేవి. బాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు


వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

**పత్తికొండ మేజర్ న్యూస్ :** జూనియర్ ఎన్టీఆర్ 42వ జన్మదిన సందర్భంగా మంగళవారం పట్టణములో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు బిటి పవన్ కుమార్ ఆధ్వర్యంలో శారద వృద్ధాశ్రమం నందు కేక్ కట్ చేశారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా బిటి పవన్ కుమార్ మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ తెలుగు ఇండస్ట్రీలో నంబర్ వన్ స్థానాన్ని అధి రోహించాలని కోరుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా అగ్రస్థా నంలో ఉన్న అభిమానుల పట్ల ఎంతో ఆప్యాయత అనురాగాలతో ఉంటారన్నారు నిరాడంబరుడు,నిగర్వి, నిబద్ధత కల వ్యక్తి అని కొనియాడారు ఆయన,ఇలాంటి పుట్టినరోజు వేడుకలు ఎన్నో, మరె న్నో జరుపుకోవాలని ఆయుష్ ఆరోగ్యాలతో కలకాలం జీవించాలని కోరారు .ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు బిటి శివ రాజు, వినయ్ గౌడ్, రాతన రాజు, చిట్టి బిటి హరి, బళ్లారి సాయి, చక్రి ,బళ్లారి వినయ్, రామచంద్ర, హెచ్ కే సురేంద్ర, మహేష్, హర్తిక్ నవీన్ తారక్,మహేష్, అయ్యర్‌మధు,అభి తదితరులు పాల్గొన్నారు.

# 22 నుంచి శ్రీ ఆంజనేయస్వామి జయంతి వేడుకలు..భజన పోటీలు

**తుగ్గలి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన తుగ్గలి కృష్ణాపురం కొండల్లో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు 22నఘనంగా నిర్వహించినట్లు ఆంజనేయ స్వామి దేవస్థానం పూజారి వద్ద ప్రహల్లాద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధ వారం ఉదయం నుండి పూజా కార్యక్రమా లు, 22న గురువారం ఉదయము పూజా కార్యక్రమము వద్ద వారి కుటుంబ సభ్యుల చేనిర్వహించబడుతున్నట్లు వారు తెలిపారు. ఉదయము 10 గంటలకు కళషోత్సవం, సాయంత్రం మూడు గంటలకు కుంభోత్సవ ం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, పూజారి వద్ద ప్రహల్లాద సమక్షంలో నిర్వహి స్తున్నట్లు వారు తెలిపారు. సాయంకాలము తుగ్గలి గ్రామం నందు ఊరేగింపు కార్యక్ర మము, రాత్రి 8 గంటల నుండి తుగ్గలి భజన బృందం రాతన చెన్నంపల్లి భజన బృందం వారిచే జరుగుతున్నట్లు వారు తెలి పారు. మొదటి బహుమతి రూ. 16,000 వద్ద రామాంజనేయులు, రెండవ బహుమ తి రూ. 13,000 వద్ద పెద్ద మల్లయ్య, మూడవ బహుమతి రూ. 10,000 ఎన్ ఆర్ స్వామి, నాలుగవ బహుమతి రూ. 8,000 ఎన్ఆర్ స్వామి, ఐదవ బహుమతి రూ. 6,000 రాంబాబు, ఆరవ బహుమతి రూ. 5,000 బోయ లక్ష్మీనారాయణ, ఏడవ బహుమతి రు.5,000 నాగరాజు, ఎనిమిద వ బహుమతి రూ.4,000 విలేకరి చిన్నారె డ్డి, పరమేశ్వర్ రెడ్డి, తొమ్మిదవ బహుమతి రూ. 3,000 ఆకుల శ్రీనివాసులు, పదవ బహుమతి రూ.2,500 బ్యాంకు శీను, 11వ బహుమతి రూ. 2,000 హోటల్ నాగేం ద్ర,12వ బహుమతిరు.రూ. 1,000 మంగలి రామాంజి తదితరులు బహుమతు లను ఇచ్చినట్లు పూజారి వద్ద ప్రహల్లాద తెలిపారు.

# నందికొట్కూరులో ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

**తలసేమియాబాధితులకు జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ భరోసా**

**మిడుతూరు (నందికొట్కూరు)మేజర్ న్యూస్ :** నందమూరి తారక రామారావు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మంగళ వారం నాడు నందికొట్కూరులో జూనియర్ ఎన్టీఆర్ సేవా సమితి మిడుతూరు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వ హించారు. ఈ వేడుకల్లో భాగంగా 20 కిలోల కేక్‌ను కట్ చేసి, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మందికి పైగా అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేకరించిన ఈ రక్తాన్ని తలసేమియా బాధితులకు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం వృద్ధాశ్రమంలో అన్నదానకార్యక్రమంచేపట్టారు. ఈ సం దర్భంగా నందికొట్కూరు తాలూకా ఇన్‌చార్జి ఎం.ఎం. బాషా మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ సేవా సమితి, మిడుతూరు వారు గతంలో అందించిన సహకారంతో బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడు తున్న రుబీన బెన్నీకి విజయవంతం గాశస్త్రచికిత్స జరిగిందని తెలిపారు. ఆ బాలుడు ఈరోజు జరిగిన కేక్ కటింగ్ లో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. కుల,మత, ప్రాంత భేదం లేకుండా ఎవరికైనా సహాయం చేయ డానికి తమ జూనియర్ ఎన్టీఆర్ సేవా సమితి,మిడుతూరు ఎల్లప్పుడూ ముం దుంటుందని ఎం. ఎం.బాషా పునరు ద్ఘాటించారు. డాక్టర్ హరిప్రసాద్, ఆటో బుజ్జి, మధు, అబ్దుల్లా, ఖాజా, అల్లావు దీన్, వెంకటరమణ, కుమార్, మురళి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

క్యాంపెయిన్ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని అందుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని కర్నూలు మున్సిపల్ కమీషనర్, అడిషనల్ ఎస్పీని ఆదేశించారు. జూన్ 21న యోగా దినోత్సవం సందర్భంగా మే 21నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర క్యాంపెయిన్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అందులో భాగంగా ఈ నెల 21న జిల్లా స్థాయి కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమీషనర్, డిఎంహెచ్ఓలను కలెక్టర్ ఆదేశించారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా యోగా శిక్షకులకు శిక్షణ, ప్రజల్లో అవగాహన ముఖ్యాంశాలుగా ఉన్నాయన్నారు. శిక్షణ కోసం మండలానికి ఒక ట్రైనర్ ఆఫ్ ట్రైనర్‌లను, అర్బన్‌లో 4వార్డులకు కలిపి ఒక ట్రైనర్ ఆఫ్ ట్రైనర్‌లను గుర్తించి జాబితాను సాయంత్రానికి ఇవ్వాలని డిఎస్‌డిఓను ఆదేశించారు. ఈ నెల 21నుండి 27వరకు జిల్లా స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఉంటుందని, మే 28నుంచి జూన్ 3వరకు మండల స్థాయిలో, జూన్ 4నుంచి 16వరకు గ్రామ స్థాయిలో ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. యోగాపై అవగాహన కలిగే విధంగా ర్యాలీలు, రంగోలి కాంపిటేషన్స్ నిర్వహించాలన్నారు. యోగాలో పాల్గొనే వారితో రిజిస్ట్రేషన్లు చేయించాలని, ప్రజలు యోగా కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా, కెఎంసి కమీషనర్ రవీంద్రబాబు, జిల్లా పరిషత్ సిఈఓ నాసరరెడ్డి, డిఎంహెచ్ఓ డా శాంతికళ, డిఆర్‌డిఏ పిడి రమణారెడ్డి, మెప్మా పిడి నాగశివలీల, రాష్ట్ర యోగా అసోసియేషన్ సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

# నా కుటుంబాన్ని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

- ఎమ్మెల్యేను కొందరు తప్పుదోవ పట్టించారు
- సీఎం చంద్రబాబు, లోకేష్ లు ఉన్నంతవరకు నేనెవ్వరికీ తలవంచను
- టీడీపీ కార్యకర్తలెవ్వరూ నిరుత్సాహపడొద్దు
- ఇకనుంచి ఎమ్మెల్యే కోసం మనం.. మన కోసం ఎమ్మెల్యే ఉంటారు
- టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కలిసికట్టుగా పనిచేసి వచ్చే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం
- మినీ మహానాడులో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు వ్యాఖ్యలు



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీ నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డిలు




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ ఉన్నన్ని రోజులు పార్టీని, నా కుటుంబాన్ని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు నాతోపాటు నా కుటుంబసభ్యులు ఉమాపతినాయుడు, భూపాల్ చౌదరి, సిద్దార్థ నాయుడు, మారుతినాయుడులు అండగా నిలుస్తారు' అని ఆదోని నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు స్పష్టంచేశారు. మంగళవారం రాష్ట్ర టీడీపీ పార్టీ ఆదేశాల మేరకు.. స్థానిక జేబీ గార్డెన్‌లోమీనాక్షినాయుడు ఆధ్వర్యంలోమినీ మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, సుబ్బారెడ్డిలు హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించాలని కోరారు.కార్యకర్తలు లేనిదే తెలుగుదేశం పార్టీ లేదన్నారు. ఆదోనిలో మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో బలమైన క్యాడర్ తో టీడీపీ పార్టీ బలంగా ఉందన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మాట్లాడుతూ.. టిడిపి పార్టీ పుట్టినప్పటి నుంచి అన్న ఎన్టీఆర్ వెనకాల నడిచిన వ్యక్తినని అన్నారు. రాష్ట్ర టిడిపి పార్టీలో నేనేంటో నా సత్తా ఏంటో, నా వ్యక్తిత్వమేంటో సీఎం చంద్రబాబు, లోకేష్ లకు క్షుణ్ణంగా తెలుసన్నారు. రాష్ట్ర పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా కర్నూలు జిల్లాలోనే ఆదోని టిడిపి పార్టీ చేసే కార్యక్రమాలు ముందు వరుసలో నిలిచేదన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు, టీడీపీ కార్యకర్తలు తనను నాయకుడుగానే కాకుండా ఓతండ్రిగా,ఓ మామగా,ఓ అన్నగా చూస్తారని తెలిపారు. నాకు ఆస్తులు అంటూ ఏమీ లేవు. అయితే ఆదోనిలో నేను సంపాదించుకున్న ఒకే ఒక్క పెద్ద ఆస్తి అది నా క్యాడర్ మాత్రమేనని స్పష్టం చేశారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు అందరూ ఏకమయ్యేలా ప్రచారం చేసి ఎమ్మెల్యే గెలుపుకు కృషి చేశామని ఆయన గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆదోనిలోని టిడిపి క్యాడర్ ఎంతో నిరుత్సాహానికి గురైందని మీనాక్షినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను కొంతమంది తప్పుదోవ పట్టించడం వల్లనే ఇలాంటి పరిస్థితికి కారణమయ్యిందని తెలిపారు. కార్యకర్తలు ఎవ్వరూ నిరుత్సాహ పడవలసిన అవసరమే లేదు. వాస్తవాలన్నీ నివృత్తి అయ్యాయని, త్వరలో అవన్నీ సర్దుబాటు అవుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇకనుంచి మనకోసం ఎమ్మెల్యే.. ఎమ్మెల్యే కోసం మనం అండగా నిలబడతామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఆదోనిలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు కలిసి పని చేస్తాయని వెల్లడించారు. గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే మూడు పార్టీలు కలిసి రానున్న స్థానిక ఎన్నికల్లో కూడా ఐకమత్యంతో పనిచేసి అన్ని స్థానాల్లో విజయ ఢంకా మ్రోగిస్తామని మీనాక్షినాయుడుస్పష్టంచేశారు.రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, శ్రీకాంత్‌రెడ్డి, ఉమ్మి సలీం, రామస్వామి, భూపాల్ చౌదరి,మారుతి నాయుడు, కార్యకర్తలుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మద్యం సేవించి వాహనం నడిపితే

# జరిమానా తప్పదు..

**పాములపాడు మేజర్ న్యూస్ :** మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానా తప్పదని ఎస్సై సురేష్ బాబు అన్నారు మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహనాలను ఆపి వారికి బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీలు చేశారు.మద్యం సేవించి వాహనాలు నడిపినా,ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోయినా,అనుమతి పత్రాలు లైసెన్స్ లేకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# జూనియర్ ఎన్.టి.ఆర్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం



ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** జూనియర్ ఎన్.టి.ఆర్ పుట్టినరోజు సందర్భంగా బనగానపల్లె పట్టణం లోని హైస్కూల్ గ్రామం నందు జూనియర్ ఎన్.టి.ఆర్ అభిమానులు ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారంనాడు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బనగానపల్లె సి.ఐ ప్రవీన్ కుమార్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించారు. ముందుగా భారత్ – పాక్‌ల మధ్య యుద్ధంలో అమరుడైన మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి అవసరమైన వారికి రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఫ్రెండ్స్ బ్లడ్‌గ్రూపు సభ్యులు చేస్తున్న సేవలు అమోఘమన్నారు. అదే విధంగా యువకులు సమాజంలో చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఇటువంటి మంచి కార్యక్రమాలకు ప్రోత్సాహాన్ని అందివ్వాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ బ్లడ్‌గ్రూపు ప్రతినిధి షాషావలి, పబ్జికుర్రాడు ఉదయ్, జాకీర్, అశోక్, సాయిరాం, అత్తార్, అన్ను, మారుతీ సకారం తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వేను సక్రమంగా నిర్వహించాలి..

### సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశం



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండలంలో భూ రీసర్వే కు పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నికైన చిన్నతుంబళం గ్రామంలో జరుగుతున్న రీసర్వేను మంగళ వారం అదోని సబ్ డివిజన్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వేను సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే రీసర్వేలో ఎలాంటి పొరపాట్లుకు తావు ఇవ్వకుండా జాగ్రత్తగా చూడాలని ఒకవేళ ఏదైనా రీసర్వే లోతప్పులు జరిగితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు ఈయన వెంట మండల తాహశీల్దారు గీతాప్రియదర్శిని. డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేర్ శ్రీనివాసరాజు. రీసర్వేర్ డిప్యూటీ తహసీల్దార్ లలిత కుమారి. ఎంఆర్ఐ జెర్మియా.మండల ఇంచార్జ్ సర్వేర్ అళ్ళప్ప. విఆర్వోలు శ్రీనివాసులు. నరసన్న. సురేష్ గౌడు. అయా గ్రామాల సచివాలయ సర్వేర్లు విఆర్ఏలు రైతులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన రంగస్వామి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన గోనెగండ్ల గ్రామ శివార్లలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. అయ్యకొండ గ్రామానికి చెందిన రంగస్వామి అనే వ్యక్తి తన గ్రామం నుంచి గోనెగండ్లకు తన ద్విచక్ర వాహనంలో గోనెగండ్ల కు వస్తుండగా అదే సమయంలో గోనెగండ్ల నుంచి గంజహళ్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనం పై గంజహళ్లి కి బయలు దేరారు. అయితే రెండు ద్విచక్రవాహనాలు వేగంగా వచ్చి గోనెగండ్ల శివార్లలో ఢీ కొన్నాయి. దీంతో రంగస్వామి అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా గంజహళ్లికి చెందిన ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. రంగస్వామిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తీసుకువెళ్లినట్లు సమాచారం.

# 31న పావన లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** మండలంలోనిఓబులంపల్లి గ్రామంలోశ్రీపావన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పునః ప్రతిష్ట కార్యక్రమాలు మే 31 నుండి ప్రారంభం కానున్నాయి. శ్రీ గణపతి, గరుత్మంత, ధ్వజ, శిఖర సహిత శ్రీ పావన లక్ష్మీనరసింహస్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు మూడు రోజులపాటు జరగనున్నాయి. జూన్ 1న స్వామివారి విగ్రహాల గ్రామోత్సవం, రెండున కొలనుభారతి ఉపాసకులు శారదాపీఠం నిర్వాహకులు శివయోగేంద్ర సరస్వతి స్వామి అనుగ్రహ భాషణం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ తెలియజేసింది. వెల్లాల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరగనున్నాయని వారు తెలిపారు. మూడు రోజులపాటు భజన కార్యక్రమం కోలాటకార్యక్రమం కోలాట కార్యక్రమం, చెక్కభజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

# పారదర్శకంగా రీసర్వే నిర్వహించాలి-ఆర్డీఓ కిడారి సందీప్ కుమార్



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ. కిడారి సందీప్ కుమార్

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** గొప్యాతలేని రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డీఓ. కిడారి. సందీప్ కుమార్ రెవెన్యూ అధికారులకు సూచించారు. మండలపరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో జరుగుతున్న రీసర్వే తీరును మంగళవారం ఆర్డీఓ పరిశీలించారు.అనంతరం రెవెన్యూ అధికారులతో అయన మాట్లాడుతూ సమస్యలు లేని రీసర్వే ను నిర్వహించి రైతులకు ప్రజలకు గొప్యతలేని జవాబుదారితనంతో పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. భూ యజమానులకు ముందస్తు సమాచారం అందిస్తూ భూ యజమానులు చెక్ బందు భూ యజమానుల అధీనంలో వారి అనుమతితో రీ సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి తహశీల్దార్ పురుషోత్తమ్ముడు, ఆర్ ఎస్ డిటీ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం,వీఎస్ లు,వీఆర్ఓలు, వీఆర్ఎలు,రైతులు పాల్గొన్నారు.

# నంద్యాల పోలీస్ స్టేషన్ కు వాటర్ కూలర్ వితరణ



**నంద్యాల అర్బన్, మేజర్ న్యూస్:** నంద్యాల పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు సెవెన్ హిల్స్ హాస్పిటల్స్ తరఫున వాటర్ కూలర్ ను వితరణగా అందించారు. సెవెన్ హిల్స్ హాస్పిటల్స్ అధినేత మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ రెంటాల మారుతి కుమార్ టూ టౌన్ సిఐ ఇస్మాయిల్ కు వాటర్ కూలర్ ను మంగళవారం రాత్రి అందజేశారు. సిఐ ఇస్మాయిల్ మాట్లాడుతూ ముందుగా సెవెన్ హిల్స్ హాస్పిటల్స్ అధినేత రెంటాల మారుతి కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు. వాటర్ కూలర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందితోపాటు పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. సెవెన్ హిల్స్ హాస్పిటల్స్ అధినేత రెంటాల మారుతి కుమార్ మాట్లాడుతూ నంద్యాల ప్రజలకు రక్షణ కల్పిస్తున్న పోలీసులకు ఉపయోగపడుతుదని వాటర్ కూలర్ ను అందించామన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఎఎస్ఐ మరియు సురేంద్ర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి శ్రామికుల సంఖ్యను పెంచండి




వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టి ఉపాధి శ్రామికుల సంఖ్యను గణనీయంగా పెంచాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి క్షేత్రస్థాయి అధికారులు, ఎంపీడీఓలు, స్పెషల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. డ్వామా పిడి వెంకటసుబ్బయ్య, హౌసింగ్ ఈఈ శ్రీహరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులు చేపట్టి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రతిరోజు 1.25లక్షల మంది ఉపాధి శ్రామికులు హాజరయ్యేలా సంబంధిత క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. కొలతల ప్రకారం శ్రామ ఇకులచే పనులు చేయించి దినసరి సరాసరి రేటు గణనీయంగా పెంచేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పనులు చేసేందుకు ఇది సరైన సమయమని రోజు రోజుకు శ్రామికులను పెంచుకుంటూ పని దినాల లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. నందికొట్కూరు, మిడుతూరు, బనగానపల్లె, బేతంచెర్ల మండలాల్లో యావరేజ్ రేటు రూ.262లు కన్నా ఎక్కువగా రావడం లేదని సరాసరి రేటు పెంచేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 12వ తేదిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఇళ్ళను ప్రారంభిస్తున్న నేపథ్యంలో జిల్లాకు కేటాయించిన 9432 గృహాల లక్ష్యాన్ని ఇళ్ళ నిర్మాణాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని హౌసింగ్ ఇంజనీర్లు ఎంపీడీఓలకు కలెక్టర్ ఆదేశించారు. ఆళ్ళగడ్డ, జూపాడుబంగ్లా, పాములపాడు, వెలుగోడు, శిరివెళ్ళ తదితర మండలాల్లో ఇళ్ళ నిర్మాణాల పురోగతి తక్కువగా ఉందని తెలిపారు. అన్ని గృహాలకు మరుగుదొడ్లు నిర్మాణాలను వచ్చేనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, చెంచు పివిటిజిలకు లక్ష రూపాయాలు ఇచ్చే అంశాన్ని లబ్ధిదారులకు వివరించి ఇళ్ళ నిర్మాణాలకు ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు.

## రేషన్ బియ్యం తూకాల్లో మోసం...



తనిఖీ చేసిన రెవెన్యూ అధికారులు..

**హాలహర్వి, మేజర్ న్యూస్ :** హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో రేషన్ బియ్యం తూకాల్లో మోసాలు చేస్తున్నట్లు ప్రజలు ఫిర్యాదులు చేయ డంతో పత్తికొండ ఆర్ డి ఓ భరత్ నాయక్ ఆదేశాల మేరకు డిప్యూటీ త హశీల్దార్ లక్ష్మి,సర్వేయర్ మంజు భార్గవి, విఆర్వోలు రాఘవేంద్ర స్వామి, పెద్దన్నలు రేషన్ షాప్ లను తనిఖీ చేపట్టారు.గూళ్యం గ్రామానికి చెందిన ఎండియు ఆపరేటర్ రేషన్ బియ్యానికి డబ్బులు వసూలు చేస్తున్నారని చెప్పగా సర్వే చేసి నివేదిక ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్ర మంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఆశయాలతో పార్టీ బలోపేతం..

తెలుగుదేశం పార్టీకి
వెన్నుదన్నుగా కార్యకర్తలు..
మినీ మహానాడులో బయట
పడిన వర్గ విభేదాలు...
మహానాడుకు దూరంగా
వైకుంఠం,కప్పట్రాళ్ల,టిడిపి
సీనియర్ నాయకులు..



జ్యోతిని వెలిగిస్తున్న ఎంపీ నాగరాజు,జిల్లా అధ్యక్షులు తిక్కా రెడ్డి,వీరభద్ర గౌడ్



వీరభద్రగౌడ్‌కు విన్నవిస్తున్న మహిళలు.

**ఆలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా నిలిచేది ఒక్క తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే అని స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి ఆశయాలతో పార్టీ అభివృద్ధిలోకి తీసుకెళ్లాలని ఆలూరు టిడిపి ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ అన్నారు మంగళవారం ఆలూరు పట్టణంలో ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ మహానాడులో ఎంపీ బస్తిపాటి నాగరాజు,జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డిలతో పాటు టిడిపి నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రెండు మార్లు టీడీపీ జాతీయ అధ్యక్షులు టికెట్ కేటాయించారని కానీ కొద్ది ఓట్లతో కొంతమంది అసమ్మతి నాయకుల కుట్రతో ఓటమి చెందానని అన్నారు.అలాగే 22 న జిల్లాలో జరిగే జిల్లా మహానాడుకు వెళ్లాలని 27 నుండి 29 వరకు కడప లో జరిగే మహానాడుకు నియోజకవర్గ నాయకులందరూ తరలి వెళ్లాలని కోరారు.అలాగే కొంతమంది మహిళలు కుట్టు మిషన్ కేంద్రాన్ని మండలంలో ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ కింద 4 లక్షల 40 వేల619 రూపాయలు అందించారు. అంతకుముందు ఎంపి నాగరాజు,జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు.కార్యక్రమంలో మండల కన్వీనర్ అశోక్ యాదవ్, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మెన్ రాంనాథ్ యాదవ్,కిష్టప్ప, దేవేంద్ర, రాము యాదవ్,నరసప్ప, నారాయణ,ఈరన్న, లక్షన్న,వెంకటేశ్,రమేష్,కృష్ణమ నాయుడులు పాల్గొన్నారు.

**మినీ మహానాడు కు దూరంగా వైకుంఠం, కప్పట్రాళ్ల సీనియర్ నాయకులు...**

ఆలూరు పట్టణంలో నిర్వహించిన మినీ మహానాడులో వర్గవిభేదాలు మరోసారి బయటకు పడ్డాయి.మినీ మహానాడుకు ఆహ్వానం అందలేదని వైకుంఠం, కప్పట్రాళ్ల,కోట్ల,గుమ్మనూరు వర్గాల నాయకులు టీడీపి సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి ఉచ్చీరప్ప,మీనాక్షి నాయుడు,చిన్న హ్యాట శేషగిరి,మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్,బిల్లేకల్ వెంకటేష్, చెన్నప్ప,మండల కన్వీనర్ లు షేక్షవలి,విజయ్ భాస్కర్, హెబ్బటం విష్ణు రెడ్డి, మారుతి,పాల్ రెడ్డి,జడ్పీటీసీ లింగప్ప,మైనార్టీ నాయకులు మహానాడుకు గైర హాజరయ్యారు.తమకు ఇంచార్జ్ నుండి కానీ ఆయా సంబంధిత జిల్లా నాయకుల నుండి కానీ పిలుపు రాలేదని వాపోయారు.పార్టీలో సీనియర్ లకు గుర్తింపు లేదన్నారు.

## వైద్య,ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




మాట్లాడుతున్న జిల్లా నాయకులు రఘుబాబు

**ఆలూరు, మేజర్ న్యూస్. :** ఏపీ హంస ఆలూరు తాలూక సర్వసభ్య సమావేశము స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆలూరు నందు జిల్లా అధ్యక్షులు బి.రఘుబాబు అధ్యక్షతన ఆలూరు తాలూక ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఉమాపతి, ట్రెజరర్ రామకృష్ణారెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ చంద్రమోహన్ ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి సయ్యద్ షఫీ, జిల్లా ఉపాధ్యక్షులు,సందీప్ త్యాగరాజతో పాటు ఆలూరు తాలూక నుండి వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి విచ్చేసిన సూపర్ వైజర్ లు మేల్ ఫిమేల్ సిబ్బంది తోపాటు అన్ని క్యాడర్లకు చెందిన వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలూరు తాలూక కార్యవర్గ సభ్యులకు కర్నూలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులను తాలూక కార్యవర్గ సభ్యులకు సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలూరు తాలూకా పరిధిలో పనిచేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల యొక్క సమస్యలపై పోరాడాలని వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అదేవిధంగా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల్లో ఏపీ హంస అసోసియేషన్ చేస్తున్న సేవలను అందరికీ తెలిసే విధంగా చేయాలని ఆదేశించారు.

## రీ-సర్వేలో భూ వివాదాలు లేకుండా చేయాలి

### ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి



మాట్లాడుతున్న ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్:** భూ సర్వేలో గ్రామాలలో ఎలాంటి భూ వివా దాలు లేకుండా అధికారులు సర్వే అధికారులు జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి కోరారు. మంగళవారం సింగవరం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను స్థానిక తహసిల్దార్ పద్మావతి ,డిటి గురునాథం డిఐఓస్ రవీంద్ర పాల్ తో కలిసి రెవెన్యూ,సర్వే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో నాగజ్యోతి మాట్లాడుతూ సింగవరం గ్రామంలో ఇప్పటివరకు జరిగిన భూముల రీ సర్వే గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పక్కాగా రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.సర్వే చేసే సమయంలో అక్కడ ఉన్న రైతులకు నోటీసులు అందించి వారి సమక్షంలో కొలతలు వేయాలన్నారు. ఎక్కడ కూడా వివాదాలు లేకుండా సర్వే పూర్తి చేయాలన్నారు.గ్రామాల్లో భూముల రీ సర్వే జరుగుతోందని, ఈ రీ సర్వేకు రైతులు సహకరించాలని అన్నారు. ఈ రీ సర్వే ప్రభుత్వ రికార్డుల ప్రకారమే జరుగుతుందని రైతులు తమ భూ సమస్యలు రీ సర్వే ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ షాహిన్ పర్వీన్ ,వీఆర్వోలు ,విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వరులను దర్శించుకున్న బి.సి ఇందిరమ్మ



బి.సి ఇందిరమ్మను సత్కరిస్తున్న దృశ్యం

**బనగానపల్లెరూరల్, న్యూస్ః** ఎర్రమల్ల కొండల్లో వెలిసిన యాగంటి శ్రీ ఉమామహేశ్వరులను మంగళవారంనాడు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ దర్శించుకున్నారు. వారు ఆలయానికి చేరుకోగానే ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ ఉమామ హేశ్వరులకు ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలను అందజేసి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో యాగంటిపల్లె ఉప సర్పంచ్ బండి మౌళీశ్వర రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వర రెడ్డి, భరతుడు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నందివర్గంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న అంకన్న

**బనగానపల్లెరూరల్,న్యూస్ః** బనగానపల్లె మండల పరిధిలోని నందివర్గం గ్రామంలో జూనియర్ ఎన్.టి.ఆర్ జన్మదినం సందర్భంగా ఫ్రెండ్స్ ఫర్ సేవా సమితి సహకారంతో నందివర్గం ఎన్.టి.ఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందివర్గం మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. దాదాపుగా 50మంది ఎన్.టి.ఆర్ అభిమానులు రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో నంద్యాల బ్లడ్ సెంటర్ అచ్యుత్ (అంకన్న) హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ప్రమాదాలు ఉండవని అది ఒక అపోహ మాత్రమేనని రక్తదానం చేస్తే భవిష్యత్తులో మనకు ఎప్పుడైనా అవసరమైనప్పుడు వాడుకోవడానికి భద్రపరిచే ఒక ప్రక్రియ అన్నారు. ఫ్రెండ్స్ ఫర్ సేవా ఫౌండర్ ఫణీంద్ర , ఛైర్మెన్ విష్ణు గాయత్రీ, ఈ బ్లడ్ డైరెక్టర్ బాపుజి నాయక్, ఈ బ్లడ్ ఇంచార్జి దానకిశోర్, ప్రాజెక్టు నేత్రా ఇంచార్జి బాబా ఫకృద్దీన్, ఎన్.టి.ఆర్ అభిమానులు చంద్రశేఖర్, సురేష్ , మౌలాలి, బాష , సూర్య, దేవకుమార్, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.